విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 28 నవంబరు 2025 8 పేజీలు

పచ్చని కుటుంబాల్లో...

ఆన్‌లైన్ గేమ్స్ చిచ్చు..!

- గ్రామాలకు పాకిన వ్యసనం
- ఆర్థికంగా నష్టపోతున్న వైనం
- నాశనమవుతున్న కుటుంబాలు

విశాలాంధ్ర - కుక్కునూరు: స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్‌ల వినియోగం బాగా పెరగడంతో ఆన్‌లైన్ పేకాట,బెట్టింగ్‌ల వ్యసనం గ్రామాలకు సైతం పాకింది.తక్కువ టైమ్‌లో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న అత్యాశతో చాలా మంది ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసలుగా మారుతున్నారు. ఇందుకోసం అందినకాడల్లా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి గేమ్‌లలో పెడ్తున్నారు. కుక్కునూరు మండలంలోని చాలా గ్రామాల్లో యువత ఆన్‌లైన్ గేమ్స్ బారిన పడుతున్నట్టు సమాచారం.ప్రతి గ్రామంలో సుమారు పదుల సంఖ్యలో యువకులు ఒకరిని చూసుకుంటూ ఒకరు ఆన్‌లైన్ పేకాట, బెట్టింగ్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బెట్టింగ్‌లు పెట్టి భారీగా నష్టపోతు న్నట్టు సమాచారం. మొదట్లో వందలు పెడ్తే వేలు రావడంతో ఇదేదో లాభసాటిగా ఉందని నమ్మిన బాధితులు.. చివరకు లక్షల రూపాయలు తెచ్చి పెట్టే స్థాయికి చేరారు. భారీ మొత్తంలో పెట్టిన డబ్బులన్నీ కోల్పోవడంతో ఎలాగైనా తిరిగి రాబట్టుకోవాలన్న ఆశతో అప్పు చేసి మళ్లీ పెట్టుబడి పెట్టడం ద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌తో యువకులు ▶మిగతా 2లో..

విద్వేష రాజకీయాలను తిరస్కరించండి

- జనవరి 18న సీపీఐ శత వార్షికోత్సవం జయప్రదం చేయండి
- సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర -కొయ్యలగూడెం: మోదీ ప్రభుత్వం అధికారంలో కొనసాగడానికి మత విద్వేష, విభజన రాజకీయాలను ఉపయోగిస్తున్నదని, ఇటువంటి విద్వేష రాజకీయాలను శ్రామికు లంతా తిరస్కరించా లని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం లో సిపిఐ పట్టణం కార్యాలయం వద్ద గురువారం మండల కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో సీపీఐ సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ మోదీ,అమిత్ షా లు దేశంలో ఉన్న ఖనిజ సంపదతో నిండిన అడవులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలనే రహస్య అజెండాతో ఆపరేషన్ కగార్ నిర్వహిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖనిజ వనరులు సమృద్ధిగా ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్,ఒడిస్సా వంటి ప్రాంతాలలో అడవులను బహుళ జాతి సంస్థలకు అప్పగించడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మావోయిస్టుల అణిచివేత వెనుక కార్పొరేట్ ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నా యని తెలిపారు. 2026లోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తా మన్న గడువు కోసమా? లేక ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిం చేందుకా అని ప్రశ్నించారు. మావో యిస్టుల అణిచివేత పేరుతో చట్టాన్ని రక్షించా ల్సిన వ్యవస్థలే అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ ఎన్కౌంటర్ల పేరుతో హత్యలకు పాల్పడుతుంటే దేశ పౌరులకు రక్షణ ఎక్కడ అని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ వందేళ్ళ ప్రయాణం ఒక అపూర్వ పోరాట గాథ అన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయడానికి సీపీఐ సభ్యులు, సానుభూతిపరులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి లక్క లక్ష్మణరావు, పట్టణ కార్యదర్శి ఎస్.కె.బాజీ, దగాని సుబ్బారావు, చింతలపూడి దుర్గారావు,వై. సతీష్, పులపాకుల దుర్గారావు, వామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 185 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - కాకినాడ : ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్(ఎస్ఐఆర్-సర్) ఇతర ఎన్నికల అంశాలపై గురువారం ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ వెలగపూడి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఎస్ఐఆర్ పై ఏఈఆర్ఓ, బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు, సర్ జాబితా మ్యాపింగ్, బీఎల్వోలకు ఐడీ కార్డు పంపిణీ, ఫారం పెండెన్సీ, ఎపిక్ కార్డులు పంపిణీ, పోలింగ్ కేంద్రాల రాసలైజేషన్ వంటి అంశాలపై చీఫ్ ఎలెక్టోరల్ అధికారి..అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్(ఎస్ఐఆర్-సర్) కార్యకలాపాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామ న్నారు. ఇందుకు సంబంధించి ఈఆర్ఓ, బీఎల్వోలకు ఈనెల 25 నాటికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసామన్నారు. అసెంబ్లీ నియోజక వర్గాల వారిగా బిఎల్వోలకు 2002, 2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ 37.53 శాతం పూర్తయ్యిందన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 బూతు లెవల్ అధికారులకు 1624 మందికి బీఎల్వో ఐడీ కార్డులు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 1640 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా 185 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ప్రతిపాదించినట్టు జిల్లా కలెక్టర్..చీఫ్ ఎలెక్టోరల్ అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై మున్సిపల్ కౌన్సిల్ ఆగ్రహం

- బిఎల్ఆర్ఎస్ నిధుల వినియోగం తాత్సారంపై మండిపాటు
- అవసరమైతే ఎమ్మెల్యేని కలుస్తాం
- వాడివేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర - పెద్దాపురం : అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అడ్డురారు... పెద్దాపురం ఎమ్మెల్యే చిన రాజప్ప అంటే అభివృద్ధి ప్రదాత. అయన మంచితనమే ఆయన్ని మూడవ సారి గెలిపించిందంటూ వైసీపీ కౌన్సిలర్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పై ప్రశంసల వర్షం కురిపిస్తూ మున్సిపల్ అధికారుల తీరు పై అగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగ తాయారు అధ్యక్ష తన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ నిధులు మూడు కోట్లుకు గాను రెండు కోట్ల రూపాయలు వర్కులు చేసి మిగిలిన కోటి రూపాయలు అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం ఏంటి అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభివృద్ధికి సహకరిస్తారని, ఆయన వెనుక ఉన్న వాళ్ళు మాటలు ఆలకించి అభివృద్ధి నిధులు పనులు చేపట్టక పోవడం తగదంటూ చైర్ పర్సన్ పొడియం వద్ద బైఠాయించారు. కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజప్పతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ పది రోజుల్లో విషయం తెలియజేసి అత్యవసర సమావేశం ఏర్పాటు ▶మిగతా 2లో..

1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సంయుక్త కలెక్టర్ మేఘా స్వరూప్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : తూర్పుగోదావరి జిల్లాలో ఖరీఫ్ 2025- 2026 ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను సంయుక్త కలెక్టర్ వై. మేఘ స్వరూప్ వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి సేకరణ అంచనా 4 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్లు తెలిపారు. 27.11.2025 నాటికి మొత్తం 34,737 కొనుగోలు కూపన్లు రైతులకు జారీ చేసినట్టు వివరించారు.

జిల్లాలోని 18 మండలాల్లో ఏర్పాటు చేసిన 201 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా, ఇప్పటివరకు 21,794 రైతుల నుంచి 1,61,611.920 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన 48 గంటల గడువులోపే మొత్తం 10,008 మంది రైతులకు 172.85 కోట్లు చెల్లింపులు చేసినట్టు తెలిపారు.

జిల్లాలోని 157 రైస్ మిల్లులు ఈ కొనుగోలు ప్రక్రియలో పాల్గొంటున్నాయని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని 17% తేమ వరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. సేకరణకు అవసరమయ్యే గోనె సంచులు జిల్లాలోని 212 ఆర్ఎస్‌కే కేంద్రాల్లో సమృద్ధిగా అందు బాటులో ఉంచినట్టు తెలిపారు. రైతులు ఇతర వివరాలకు 8309487151 నంబర్‌కు సంప్రదించవచ్చు అని తెలియ చేశారు.

పీ-4కు బాసటగా నిలవాలి

మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ-4కు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికరంగంగా అభివృద్ధిపథంలో నిలిపేందుకు ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబాడులు పెట్టేందుకు ఆహ్వానిస్తూ, పరిశ్రమల స్థాపనకు విశేష కృషి ▶మిగతా 2లో..

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలి

విశాలాంధ్ర- చింతలపూడి : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా తయారుచేసిన విజయ కేతనం పుస్తకాన్ని శాసన శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ గురువారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా ప్రణాళిక బద్ధంగా చదువుకొని ప్రతి ఒక్కరు మంచి మార్కులతో రాణించాలని అన్నారు. అందరూ చదువులో రాణించి తల్లిదండ్రుల పట్ల, ఉపాధ్యాయుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని అన్నారు. అనంతరం శాసనసభ్యులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వంట తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతం విష్ణుమూర్తి, జనసేన పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, చిట్లూరి ధర్మరాజు, చింతలపూడి సొసైటీ చైర్మన్ తులిమిల్లి రామారావు, విద్యాశాఖ అధికారి ఎస్.కిరణ్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిఆర్ఎల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర -భీమవరం: భారత రాజ్యాంగం, సామాజిక బాధ్యతలు అనే అంశం పై మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిం చిన వక్తృత్వం, క్విజ్, వ్యాస రచన పోటీల్లో కెజిఆర్ఎల్ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు పలు బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు కోటికల పూడి గోవిందరావు, సెక్రటరీ, కరస్పాండెంట్ మెంటె రామ్ మనోహర్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఐ.రామచంద్రమూర్తి, పి.జి.కోర్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తోట రామమూర్తి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.ఐజక్ బాబు, పి.మురళీ మోహన్, కె.రాంబాబు, పి.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల నెట్‌బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్

విశాలాంధ్ర- పాలకోడేరు: అంతర్ జిల్లాల 69 వ అండర్ -14 బాల బాలికల నెట్ బాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ ఈనెల 27, 28, 29 తేదీలలో పాలకోడేరు మండలం శృంగ వృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతుందని ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట కాశీజగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ ప్రారంభిస్తారని, తెలిపారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ స్పీకర్, స్థానిక శాసనసభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రివర్యులు భూపతిరాజు శ్రీనివాసరావు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు, జిల్లా ఇన్‌చార్జి గొట్టుపాటి రవికుమార్, భవనాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాలోని ఇతర శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా ప్రాదేశిక సభ్యులు, పాలకోడేరు ఎంపీపీ, మండల ప్రాదేశిక సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-కాళ్ల : విద్యార్థి దశ నుండే రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫోక్సో న్యాయమూర్తి బి లక్ష్మీనారాయణ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమవరంలో జరిగిన డిబేట్ పోటీల్లో కాళ్ళ మండలం మాల వాని తిప్ప గ్రామానికి చెందిన హైస్కూల్ విద్యార్థిని జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన పత్స మట్ల రమాదేవి కి విష్ణు కాలేజీలో నిర్వహించిన సభలో ఆయన చేతుల మీదుగా మెమెంటో అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పాల నరసింహారావు తెలియజేశారు. పలువురు ఆమెను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు స్వామి పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్వహణ మెరుగుపరుస్తాం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : పట్టణంలో మురుగునీటి పారుదల సాఫీగా జరిగేలా డ్రైనేజీల నిర్వహణను మెరుగు పరుస్తామని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో డ్రైనేజీ,పారిశుద్ధ్య నిర్వహణను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ అవుట్ లెట్లు సరిగా లేకపోవడంతో మురికినీటి ప్రవాహం సరిగా జరగడం లేదన్నారు. అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించకూడదని, ప్రజారోగ్య పరిరక్షణకు అందరూ సహకరించాలని అన్నారు. క్షేత్ర పరిశీలన అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ను సందర్శించారు. మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమై మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కలిగించే ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, ఎమ్మార్వో సునీల్ కుమార్, మున్సిపల్ టిపిఒ జగదీష్, చాపల రమేష్, అడ్డగర్ల సురేష్, మద్దాల మణికుమార్, పై బోయిన వెంకటరామయ్య, రామశెట్టి సురేష్, దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గేమ్స్‌చిచ్చు

(1వపేజీ తరువాయి)

ఆర్థికంగా నష్టపోతుండడంతో పాటు కుటుంబాల్లో గొడవలు కూడా జరుగుతున్నాయి. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య, భార్యాభర్తల మధ్య గొడవలు అవుతున్నాయి. అప్పులు తీర్చేందుకు కొందరు పిల్లలు తమ తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు సమాచారం. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన యువకులు కొందరు అప్పులు తీసుకుంటున్నారు. దీనిని అదునుగా తీసుకుని వడ్డీ వ్యాపారులు వందకు రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.దీంతో అసలుతో పాటు వడ్డీ భారీగా పెరిగిపోతున్నది. కొందరైతే ద్విచక్ర వాహనాలను కూడా తనఖా పెట్టి మరీ బెట్టింగ్ లకు పాల్పడుతున్నారు.పలు చోట్ల కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు నడిపే వ్యక్తులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారు. నిర్ణీత గడువులోగా అప్పు, వడ్డీ డబ్బులు చెల్లించకుంటే అధిక వడ్డీ వేసి మరీ డబ్బులు వ్యాపారులు గుంజుతున్నారు. అనేక మంది యువకులు ఆన్‌లైన్ గేమ్స్ ఉచ్చులో చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నారు.యువత ఆన్‌లైన్ గేమ్స్‌జోలికి వెళ్లకుండా పోలీసులు గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధిక వడ్డీకి అప్పులిస్తున్న ఫైనాన్స్ వ్యాపారులపై కూడా విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

బాసటగా నిలవాలి

(1వపేజీ తరువాయి)

చేస్తున్నారన్నారు. నూజివీడు సబ్ కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నూజివీడు నియోజక వర్గం అభివృద్ధి కోసం పబ్లిక్, ప్రైవేటు పీపుల్స్ పార్టనర్ షిప్ ఫోరంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులతో పార్థసారథి ప్రత్యేక సమావేశం నిర్వహించి పీ-4 కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖపట్నంలో సిఐఐ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు స్పందించి 12 లక్షల కోట్ల రూపాయలకు పైగా మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. పరిశ్రమల స్థాపనతో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి బాటలో పెట్టడంతోపాటు, రాష్ట్రంలోని యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా ప్రతి ఒక్కరు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని అన్నారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖలు అధికారులు, బ్యాంకు అధికారులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆగ్రహం

(1వపేజీ తరువాయి)

చెయ్యాలన్నారు. సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ఇంటిపన్ను పెంపు పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి కౌన్సిలర్ గోకేడ అప్పారావు మాట్లాడుతూ బంగారమ్మ గుడి వీధిలో మంచి నీటి బోరు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు కొత్త బోరు వెయ్యటం లేదన్నారు. వెంటనే బోరు నిర్మించాలని డిమాండ్ చేస్తూ కౌన్సిల్ సమావేశంలో క్రింద కూర్చుని నిరసన తెలిపారు. వైసిపి కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాంకు కాలనీలో భవనాల కొలతలు కొత్తగా వేసి రూ.4 వేలు ఉన్న ఇంటి పన్ను ఒకేసారి రూ.11వేలకు పెంచటమే కాకుండా గత మూడేళ్లగా రూ.4 వేలచొప్పున మాత్రమే పన్ను వసూలు చేసినందున మిగిలిన రూ.7 వేలు కూడా చెల్లించాలని అనటం సమంగాసంగా లేదన్నారు. వైసిపి కౌన్సిలర్ కనకదుర్గ తన వార్డు పరిధిలో డ్రైన్ నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, మేనేజర్ జ్యోతి రాణి, డిఈఈ డిఎస్ ప్రకాశరావు, ఏఈలు సుధాకర్, ఉమామహేశ్వరి, శానిటరీ ఇన్స్పెక్టర్ బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన గ్రామం, అదవి పేట, డోర్ నెంబర్: 9-159 నివాసులైన **ఈదరపల్లి శివరామరాజు, తండ్రి లక్ష్మీపతి రాజు** వ్రాయించి ఇచ్చిన ప్రకటన. నా తండ్రి **ఈదరపల్లి లక్ష్మీపతి రాజు, తండ్రి వెంకట కృష్ణరాజు,** డోర్ నెంబర్ 9-159, అదవి పేట, కాట్రేనికోన గ్రామంలో మా ఇంటివద్ద **ది.27-12-2006**న మరణించారు. వీరి మరణం ప్రభుత్వ రికార్డులలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **10 రోజులలో** తెలియజేయగలరు.

ఈదరపల్లి శివరామరాజు, తండ్రి లక్ష్మీపతి రాజు
అదవి పేట, కాట్రేనికోన గ్రామం, కాట్రేనికోన మండలం, సెల్:9449268994

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

విశాలాంధ్ర – ఉంగుటూరు : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, రైతన్న మీకోసం ఇతర కార్యక్రమాల నిమిత్తం డిసెంబర్ 1వ తేదీన ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడు ఉంగుటూరు మండ లంలో పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కోరారు. గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో కూటమి నాయకుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనసమీకరణ, రూట్ మ్యాప్, సభకు వచ్చే ప్రజల సౌకర్యార్థం చేయవలసిన ఏర్పాట్లు పై కూటమి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల నిమిత్తం గ్రామ స్థాయి, మండల స్థాయి వారీగా సమావేశాలు నిర్వహించి కూటమి నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సీఎం పర్యటనలో భాగంగా హెలిప్యాడ్, రైతన్నా మీ కోసం కార్యక్రమం, పార్టీ కార్యక్రమాలు నిర్వహణకు గొల్లగూడెం గ్రామాన్ని ఎంపిక చేసుకున్నప్పటికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసే గ్రామం పై శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల వాసు, మండల టిడిపి అధ్యక్షులు వేములపల్లి సుధీర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు కరణం పెద్దిరాజు, తదితరులు మాట్లాడారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర-ఉంగుటూరు : బాల్య వివాహాలు లేని సమాజం నిర్మించటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. బాల్య వివాహ వ్యతిరేక కార్యక్ర మాలను వంద రోజుల పాటు ప్రత్యేక ప్రచారంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, గురువారం ఉంగుటూరు శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో 'బాల్య వివాహ ముక్త భారత్' ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి, కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, భీమడోలు ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.ఎస్. రాజశేఖర్, పర్యవేక్షకురాలు భాగ్యలక్ష్మి, క్రాఫ్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ -2026 పరీక్షలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - ఏలూరు: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బి.సి, ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్,మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబరు 3వరకు పొడిగించినట్టు జిల్లా బి.సి. సంక్షేమశాఖ అధికారి ఆర్.వి. నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉచిత శిక్షణ కొరకు ఏలూరు జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదవ తరగతి,ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు,స్టడీ సర్టిఫికేట్,కుల ధృవీకరణ పత్రము,ఆదాయ ధృవీకరణ పత్రము (రూ.10వేలు లోపు) లేదా వైట్ రేషన్ కార్డ్,ఆధార్ జిరాక్స్‌లు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో డిసెంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు బి.సి. స్టడీ సర్కిల్, వెన్నవల్లివారిపేట, డా. బి. ఆర్. అంబేద్కర్ స్కూల్, ఫస్ట్ ఫ్లోర్, ఏలూరులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు డిసెంబరు 7న రాజమహేంద్రవరంలో స్క్రీనింగ్ పరీక్ష జరుగుతుందన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన వారికి డిసెంబరు14 నుండి బి.సి. స్టడీ సర్కిల్,గొల్లపూడి, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లాలో ఉచిత శిక్షణ, బస, భోజన వసతి ఉంటుందన్నారు. వివరములకు ఫోన్‌నెం. 8686180018, 9030211920 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

ఆర్టీసీ పెట్రోలు బంకు ఘటనలో దోషులను శిక్షించాలి : ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర -ఏలూరు: ఆర్టీసీ పెట్రోల్ బంకులో జరిగిన కుంభకోణంలో అవినీతి పరులను వెనకేసుకొస్తున్న యాజమాన్య వైఖరిని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని , దోషులను శిక్షించి అక్రమంగా సస్పెండ్ చేసిన నలుగురి సస్పెన్షన్లు ఎత్తివేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏఐటియుసి ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు కె. కృష్ణమాచార్యులు ప్రకటించారు.

ఏలూరు ఆర్టీసీ అధికారుల వైఖరికి నిరసనగా కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో డిపో వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. నాలుగో రోజు దీక్షలు చేపట్టిన వారికి పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో జరిగిన సుమారు 83 లక్షల రూపాయల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు . దీనిలో సంబంధం ఉన్న అధికారులు, కుట్ర దారులను తప్పించేందుకే యాజమాన్యం అమాయకులను సస్పెండ్ చేసిందని కృష్ణమాచార్యులు విమర్శించారు. జరిగిన ఉదంతాన్ని బుధవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా డీఆర్సీ సమావేశం సందర్భంగా శాసనసభ్యులు ద్వారా మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి విచారణకు ఆదేశించినట్టు వెల్లడించారని మంత్రులకు వివరించినట్టు కృష్ణమాచార్యులు తెలిపారు. అమాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ. అప్పలరాజు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. నలుగురు ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాలుగో రోజు దీక్ష చేసిన వారిలో డి. శ్రీరాములు, కే. ప్రదీప్, ఎ. మీనా, పి. ప్రభావతి, జీవీ శాస్త్రులు, పీఎస్ బాబు , జి.ఈశ్వరరావు , బిఎస్ కళ , బిఎస్ నారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో పాటు ఎస్‌డబ్ల్యూఎఫ్, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టుపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -భీమవరం: సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల నుండి ప్రజలు ముఖ్యంగా వయోవృద్ధులు అవగాహన కలిగి ఉండాలని, తమను తామే రక్షించుకోవాలని హెల్పేజ్ ఇండియా రాష్ట్ర ప్రోజెక్ట్ మేనేజర్ శ్యామ్ కుమార్ అన్నారు. సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ, హైదరాబాద్‌కు చెందిన హెల్పేజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో భీమవరంలో సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రిటైర్ ఉద్యోగులు, వృద్ధులు, మహిళలపై వల వేస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో భాగంగా ఆయన డిజిటల్ అరెస్టు, సైబర్ నేరాలు, డిజీ లాకర్, సంచార్ సాథీ, ఎం-ఆధార్ వంటి సురక్షిత మైన డిజిటల్ యాప్ లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవరాయ సాంస్కృతిక సమితి ప్రధాన కార్యదర్శి మెంటే పార్థసారథి, ఫోరం ఫోరం అధ్యక్షులు నల్లం వేంకట కృష్ణ నాగేశ్వరరావు, సభ్యులు మేళం దుర్గా ప్రసాద్, ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, డాక్టర్ దాయన చంద్రజీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు బహూకరణ

విశాలాంధ్ర -భీమవరం: పట్టణానికి చెందిన ప్రముఖ సాఫ్ట్వేర్ ఇంజనీర్ వారణాసి సుబ్రహ్మణ్యం తన తండ్రి ప్రొఫెసర్ వారణాసి రామ బ్రహ్మం సేకరించిన పుస్తకాలను ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ కౌన్సిలింగ్ విభాగానికి బహుకరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదివి విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్నే కాకుండా సమాజ వికాసానికి కూడా దోహదకారులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవి పండితులు కలిగొట్ల గోపాల శర్మ, అధ్యాపకులు డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, కెరీర్ కౌన్సిలింగ్ సెల్ కన్వీనర్ ఎస్.లక్ష్మీకాంతం, జి.ప్రసాద్ బాబు, సిబ్బంది కె.రామకృష్ణ, వి.నరసింహారావు, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు

ఇంటర్ బోర్డు ఆర్ఐవో వెల్లడి

విశాలాంధ్ర -లింగపాలెం: ఇంటర్ చదివే విద్యార్థులు నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణపై నిర్వహించే పరీక్షలలో ఉత్తీర్ణులైతేనే పై చదువులు చదివేందుకు అర్హత పొందుతారని ఇంటర్ బోర్డ్ ఆర్.ఐ.ఓ యోహాన్ తెలిపారు. దీనికోసం విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని వెల్లడిం చారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి విశాలాంధ్రతో ఆయన మాట్లాడుతూ నైపుణ్యతకు చెందిన పరీక్షలను జనవరి 21న, 23న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభను పెంచేందుకే ఈపరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. ఏలూరు జిల్లాలో ఈఏడాది సంవత్సరాల కాలంలో ఇంటర్లో మంచి ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే జిల్లాకు గుర్తింపు తేవాలనే లక్ష్యంతో విద్యార్థులకు కాలేజీలలో బోధన జరుగుతుందని ఆర్.ఐ.ఓ వెల్లడించారు. ప్రభుత్వ కాలేజీ లలో ఇంటర్ చదివే విద్యార్థులకు ఎటు వంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించిందని దీనివల్ల విద్యార్థులకు వెసులుబాటు, సంతృప్తి ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న 19 ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన 4,200మంది విద్యార్థులు పరీక్షలు రాయటానికి సిద్ధపడుతున్నారని తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 2,200 మంది,సెకండ్ ఇయర్ విద్యార్థులు 1990 మంది పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఈఏడాది నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో లెక్చరర్ల కొరత లేదని దీనివల్ల విద్యార్థులకు బోధనలో ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. జిల్లాలో ప్రైవేటు జూనియర్ కాలేజీల నుంచి ఫస్ట్ ఇంటర్‌లో 16,200, సెకండ్ ఇంటర్లో 16,400 పరీక్షలకు సిద్ధపడుతున్నారని అన్నారు. విద్యార్థులపై ఒత్తిడి ఉండకూడదని దీన్ని అన్ని కాలేజీల లెక్చరర్లు గుర్తించి విద్యార్థులు మానసికంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు చూసి ఇస్తున్నామని దీనిపై పర్యవేక్షణ కూడా చేస్తున్నామని ఆర్ఐఓ తెలిపారు.

పాఠశాలల్లో వసతులు లేకపోతే గుర్తింపు రద్దు

డిఇఒ వెంకట లక్ష్మమ్మ

విశాలాంధ్ర-టి నరసాపురం: పాఠశాల లలో పూర్తి స్థాయి వసతులు లేకపోతే గుర్తింపు రద్దు చేస్తానని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకట లక్ష్మమ్మ హెచ్చరించారు. స్థానిక శ్రీ సాయి సూర్య పబ్లిక్ స్కూల్ ను గురువారం ఆకస్మిక తనిఖీ చేసారు. తరగతి గదులు,మరుగుదొడ్లు, గ్రంధాలయం ను తనిఖీ చేసారు. ఉపాధ్యాయుల విద్యార్హతతో పాటు పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో పూర్తి స్థాయిలో వసతులు లేవని వారం రోజుల్లో సరిచేసుకోక పోతే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తానని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహ పంక్తి బోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆమె తెలిపారు. కనీసం 20మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించేటట్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాశాఖాధికారులు టి. రామ్మూర్తి, ఎస్ కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు బిఎల్ స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

మున్సిపల్ వర్కర్స్ జెఎసి

విశాలాంధ్ర -భీమవరం: ఆఫ్కాస్ ఔట్సోర్సింగ్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్ గా పని చేస్తూ అరవై ఏళ్ళు నిండిన ఆరుగురు కార్మికులను నిర్బంధంగా విధులు నుంచి తొలగించారని, వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని మున్సిపల్ కార్మికుల జెఎసి నాయకులు మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎఐసిటియు జిల్లా నాయకులు కె.మహంకాళి మాట్లాడుతూ మాడుగుల నారాయణరావు, దనాల వెంకటలక్ష్మి, రెల్ల రాము, నిమ్మల గురువులు, బొచ్చి కాంతమ్మ, ముత్యాల వేణుగోపాలరావులకు 60 సంవత్సరములు వయస్సు పూర్తి అయినదని ముందుగా తెలియచేయకుండా అత్యవసరంగా ఈ నెల 17 నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ప్రభుత్వం నుండి ఏవిధమైన పెన్సన్ గానీ, గ్రాట్యుటీ గానీ, రిటైర్డుమెంటు బెనిఫిట్స్ గానీ ఇవ్వరు. ఈ వృత్తినే చేసుకుంటూ ఇంతవరకూ వారి కుటుంబాలను పోషించుకున్నారని వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. నవంబరు నెలకు సంబంధించిన వతనాలను కూడా వారికి అందచేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు: డిసెంబర్ 1వ తేదీన ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలక్టర్ కె.వెట్రి సెల్వి అధికారు లతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ డిసెంబర్,1వ తేదీన ఉంగుటూరు మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటారని, అందుకు సంబంధించి ఆయా ప్రదేశాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి డిసెంబర్,1వ తేదీన ఉంగుటూరు మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ, బంగారు కుటుంబాలను కలిసి మార్గదర్శకులతో సమావేశమయ్యే అవకాశం ఉందని, అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందన్నారు. గొల్లగూడెం, గోపీనాథపట్నం లలో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సభాస్థలి ప్రాంతాలను అధికారులు పరిశీలించి, ఏర్పాట్లకు అనువైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలను వెంటనే సమ ర్పించాలని, వాటిని ఆమోదం కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపవలసి ఉంటుందని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: నియోజకవర్గ కేంద్రం నూజివీడు యంపిడివో కార్యాలయ ప్రాంగణంలో గురువారం రూ.20 లక్షలతో ఆధునీకరించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవం, రూ.25 లక్షలుతో సమావేశ మందిరంకు శంకుస్థాపన, రూ.3.50 లక్షలతో నియోజకవర్గ అబివృద్ధి - ప్రణాళిక కార్యాలయం ప్రారంభోత్సవాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ అభివృద్ధి - ప్రణాళిక కార్యాలయంలో ఆంధ్ర 2047 యాక్షన్ ప్లాన్, ప్రజా ధర్బార్ పిజిఆర్ యస్ అర్జీలుపై సంబంధిత అధికారులతో మంత్రి కొలుసు పార్థసారథి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్న “స్వర్ణ ఆంధ్ర -2047” అనే ప్రభుత్వ దార్శనికతను అమలు చెయ్యడానికి ఉద్దేశించిన ప్రణాళిక అన్నారు. వ్యవసాయం, త్రాగునీరు, సాగునీరు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమాలలో జెడ్పీ సిఈవో యం.శ్రీహరి, డియల్డివో పి.వెంకటరత్నం, తహశీల్దారు జి.బద్రు, యంపిడివో సి.హెచ్. రాఘవేంద్ర నాథ్, వివిధ శాఖలు అధికారులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



బాలుని వైద్యానికి సాయం

విశాలాంధ్ర -భీమవరం: ఇటీవల గ్యాస్ స్టవ్ పై టపాసులు పేలిన ఘటనలో గాయపడిన ఇంపీరియల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొగల్తూరు గ్రామానికి చెందిన బాబీ వైద్య ఖర్చుల నిమిత్తం కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు పదిహేను వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షులు గొలగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ గిరిజన సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, రవీంద్ర

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య బుట్టాయిగూడెం మండల అధ్యక్ష, కార్య దర్శులుగా చోడెం వెంకటేశ్వరరావు,కుర్సం రవీంద్ర ఎన్నికైనట్టు సిపిఐ బుట్టాయిగూడెం

మండల కార్యదర్శి చోడెం దుర్గ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పార్టీ తమను నమ్మి అప్పగించిన బాధ్యతను పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.గిరిజన సమస్యలపై ఏపీజిఎస్ అనేక పోరాటాలు చేస్తూ గిరిజనుల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి మండల కార్యదర్శి చోడెం దుర్గ శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ ఎన్నికైన వారిలో మడకం గంగరాజు,పద్దం దుర్గారావు,దువ్వా దుర్గారావు, పూనేం మల్లేశ్వరరావు, తెల్లం మునీశ్వరరావు, మడకం గంగరాజు,దుర్గమ్మ,ఆకుల రమేష్,కురుసం రాజు,పూనేం మంగరావు, వీరబాబు లు ఉన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం : మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలని ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత అన్నారు. భీమవరం మండలం చిన అమిరం గ్రామంలో రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్ సహకారంతో

23 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించారు. సుజాత మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం రాజ్ ట్రస్ట్ చేస్తున్న సేవా అద్వితీయమని అన్నారు. వైఎస్సార్ సిపి భీమవరం ఇన్ ఛార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ సేవ చేయడం సామాజిక బాధ్యత అని, రాజ్ ట్రస్ట్ గత 20 ఏళ్లుగా చేస్తున్న సేవలు అమోఘమని అన్నారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఏడాదిలో 3 వేలు మహిళలకు 3 వేల కుట్టు మిషన్లు అందించాలనే సంకల్పంతో ఇప్పటికి 2973 కుట్టు మిషన్లు అందించారన్నారు. గత 20 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలను ట్రస్ట్ ద్వారా చేస్తున్నారన్నారు. రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్ మాట్లాడుతూ అర్హత ఆధారంగా 5 జిల్లాల్లో పేద మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో కలిదిండి రామచంద్రరాజు, బిజెపి నాయకులు కోమటి రవి కుమార్, గొట్టుముక్కల పద్మనాభ రాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ప్రెసిడెంట్ నియామకం పై అభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయము లో డీసీసీ ప్రెసిడెంట్ నియామకం కొరకు ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ మెంబర్ పంజాబ్ రాష్ట్ర మాజీ

ఎంపీ జస్ బీర్ సింగ్ గిల్ పార్టీ పరిశీలకుడుగా హాజరై పరిస్థితిని సమీక్షించారు. స్థానిక పరిస్థితిని , జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని అన్నారు. గెలుపే లక్ష్యంగా దూసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.హరికుమార్ రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గోగులమండ భాస్కరరావు, కోఆర్డినేటర్, కొర్రగింజల హరికిరణ్, నాయకులు పాల్గొన్నారు.

నగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా గజ్జల గణేష్

విశాలాంధ్ర-మండవల్లి: సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ,డైరెక్టర్లతో కలిసి రాష్ట్ర మంత్రి సవిత సమక్షంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సగర

కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం నుండి గజ్జల గణేష్ సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.ప్రమాణ స్వీకారం అనంతరం గజ్జల గణేష్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసినందుకు, నియోజకవర్గ నాయకుల మద్దతుతో ఈ పదవి లభించిందని తెలిపారు.

కొండపోరంబోకు భూమిపై హక్కు కల్పించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: పేదలకు పంపిణీ చేసిన కొండ పోరంబోకు భూమిపై హక్కు కల్పించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎర్రంపేటలో సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ మండలంలో ఎర్రంపేట గ్రామంలో సీపీఐ ఉద్యమం ద్వారా నిరుపేదలకు 2005వ సంవత్సరంలో 246/1లో ఒక్కొక్కరికి 57 సెంట్లు కొండగుట్ట పోరంబోకు భూములు ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినప్పటికీ, అధికారులు, భూస్వాములు పంట పండించుకోకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. భూమి హక్కుదారులు భూమిలో పంటను పండించుకోవడానికి అవకాశం కల్పించాలని కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన భూమిపై పేదలకు హక్కు ఉన్నప్పటికీ, పెత్తందారులు అడ్డుకుని పేదలకు ఇచ్చిన భూములలో పేదలను వ్యవసాయం చేయకుండా అడ్డుపడుతున్న వారిని తొలగించాలని , లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు, లక్క లక్ష్మణరావు, దగాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

విశాలాంధ్ర- చింతలపూడి: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చింతలపూడి నియోజకవర్గం శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అన్నారు.చింతలపూడి మండలం బట్టువారిగూడెం గ్రామంలో 1కోటి 40 లక్షలతో నిర్మిచానున్న ప్రాథ మిక ఆరోగ్యం కేంద్రానికి శంకుస్థాపన భూమి పూజ నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చింతల పూడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిధులు మంజూరయ్యాయన్నారు. దాదాపు 10 వేల మందికి వైద్య సదుపాయాలు అందుతాయని అన్నారు. చింతలపూడి నగర పంచాయతీకి జడ్పీ నిధుల నుంచి నాలుగు కోట్ల రూపాయలు నిధులు మంజూరు

అయ్యాయని త్వరలో రోడ్లన్నీ పూర్తి చేస్తామని అన్నారు.ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి నిధులు మంజూరు చేయించామని, మంత్రి నిధుల నుంచి నాలుగు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించామని త్వరలో రోడ్లు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, తెలుగుదేశం పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చింతం విష్ణుమూర్తి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య దేవాలయం నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర- తణుకు: తణుకు సూర్య దేవాలయం నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ధర్మకర్త మండలి సభ్యులు చేత ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎంతో విశిష్టత కలిగిన సూర్యదేవాలయం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని అన్నారు. తణుకు చుట్టుపక్కల నుంచి ఎంతోమంది భక్తులు ఈ దేవాలయం వచ్చి దర్శించు ఉంటారని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు.కమిటీలు యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలని ఉద్దేశంతో టిడిపి, జనసేన ,బిజెపి పార్టీకి చెందిన పదిమందితో కమిటీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని చెప్పారు. విశిష్టమైన దేవాలయంగా పేరుగాంచిన సూర్య దేవాలయం మరింత ప్రతిష్ట పంచే విధంగా కృషి చేయాలని కోరారు.నూతన కమిటీ: కమిటీ అధ్యక్షులు గా గమిని రామచంద్రరావు ధర్మకర్తలుగా కొయ్యని సత్యనారాయణ ,బడేటి సాయిరాం ,కల్వకుంట భవాని, చర్ల వెంకట సుబ్బలక్ష్మి, యు కృష్ణ, లంక దేవి కుమారి ,గంట శ్రీదేవి, ఎలుపూడి నాగమణి, అంబుల సత్యనారాయణ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పాండ్రంగి నాగేశ్వరరావు, S/o. పాండ్రంగి కృష్ణమూర్తి, డోర్ నెం.2-2, పెద్దవంతెన వద్ద, కాపుల పేట, ఉండి (గ్రా), ఉండి (మం), ప॥గో॥జిల్లా., ఆంధ్రప్రదేశ్, నేను ది.10.10.2025 వ తేదిన నా ఒరిజినల్ పాసుపోర్టు నెం. E0832727 ను జిరాక్స్ తీయునిమిత్తం ఒక కవరులో పెట్టుకుని మా ఇంటి వద్ద నుంచి ఉండి సెంటరుకు వెళ్తుండగా జారి పడిపోయినది. ఎంత వెదికిననూ దొరకలేదు.

కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు

ఏపీ ఎన్జీవోల సభ్యత్వాల నమోదు

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఏపీఎన్జీవో ఎన్నికల ప్రక్రియకు మండవల్లి యూనిట్ సభ్యత్వాల నమోదుకు శ్రీకారం చుట్టినట్లు యూనిట్ అధ్యక్షుడు ఎంవి సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. ముదినేపల్లి పీహెచ్సీ వద్ద సభ్యతాల నమోదు సూపర్వైజర్ శ్రీనివాసరావు సమీక్షిం చారు. తొలిరోజు వైద్య సిబ్బంది , జడ్పీ ఉన్నత పాఠశాల, సచివాలయ సిబ్బంది సభ్యత్వం తీసుకున్నారు.

గంగానమ్మ ఆశీస్సులతో ఏలూరు అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : గంగానమ్మ ఆశీస్సులతో ఏలూరు నగరం మరింత అభివృద్ధి చెందా లని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకాం క్షించారు. స్థానిక పడమర వీధి, తంగెళ్ళ మూడి ప్రాంతాల్లో జరుగుతున్న గంగా నమ్మ జాతర ఉత్స వాల్లో భాగంగా గురువారం

అమ్మవారికి ముడుపులు కట్టే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడిన ఎంపీ గంగానమ్మ ఏలూరు నగర ప్రజలను చల్లగా చూడాలని, సమృద్ధిగా పంటలు పండి రైతులు, విద్యా, ఉద్యోగ, వ్యాపారాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేడట్లు ఆశీర్వదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ వేడుకలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తో పాటు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య కూడా పాల్గొన్నారు.

లే-అవుట్‌ను రెగ్యులర్ చేయడానికి లబ్ధిదారులు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా ఎల్ఆర్ఎస్ స్కీంను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గణపవరం మండలం సరిపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి దైవాల

రామాంజనేయులు గురువారం తెలిపారు. దీనిలో భాగంగా సరిపల్లె పంచాయతీ పరిధిలో అనధికారిక లేఅవుట్లు స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు సదరు స్కీమును ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. 23 జనవరి 2026 వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకున్నట్లయితే వారి స్థలాలను రెగ్యులైజేషన్ చేస్తామని అన్నారు.

భోగేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా శింగనపల్లి



విశాలాంధ్ర - కలిదిండి : స్థానిక భోగేశ్వరంలంకలో స్వయంభుగా కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి కార్యనిర్వహణ అధికారిగా శింగనపల్లి. శ్రీనివాసరావు నియమితుల య్యారు. దేవాదాయ- ధర్మాదాయ శాఖ కమిషనర్ పదోన్నతపై నియమిస్తూ శింగనపల్లి కి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్యనిర్వహణ అధికారిగా పనిచేయుచున్న వి. ఎన్. కే .శేఖర్ ని పదోన్నతి పై విన్నకోట గ్రూపు దేవాలయములకు బదిలీ అయ్యారు. వడాలిలో ఉన్న శ్రీ జగన్నాథ స్వామివారి దేవస్థానం, గురజ దేవాలయములను బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

మిషనరీ వినియోగించి లేసు అల్లికల నాణ్యత పెంచుకోవాలి

విశాలాంధ్ర - నరసాపురం: లేసు అల్లికలకు మెషీన్లు ఉపయోగించి ఉత్పత్తుల నాణ్యత పెంచుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని వేములదీవిలో డెవలప్మెంట్ కమిషనర్ (హస్తకళలు), టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సహకారంతో అపిటికో లిమిటెడ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన టూల్ కిట్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య

అతిథిగా పాల్గొని మాట్లాడారు.లేసు ఉత్పత్తులకు మంచి రేటు పొంది ఆదాయం పొందాలన్నారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు తో కలసి లేసు అల్లికల మహిళలకు 32 మందికి ఇంప్రూవ్డ్ టూల్కిట్స్ , కుట్టు మెషీన్లు అందజేశారు. కార్యక్రమంలో అపిటికో పీడీ సుధీర్ కుమార్ , ఐ వీవీ,ఎఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ,జిల్లా మహిళా అధ్యక్షురాలు డా. శిరిగినీడి రాజ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు వడ్డీ ముక్తేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో మెరుగ్గా పారిశుధ్య చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి

విశాలాంధ్ర - కొవ్వూరు : పట్టణంలో సభ్యుల సహకారంతో పారిశుధ్యం మెరుగుదలకు కృషి చేస్తున్నామని కొవ్వూరు మున్సిపల్ ఛైర్పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ కౌన్సిలర్ సాధారణ సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు సభలో అజెండాను ప్రవేశపెట్టారు. కౌన్సిల్ సభ్యులు అజెండాలోని అంశాలను పరిశీలించి ఆమోదాన్ని తెలపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో సమస్యలను తెలియజేశారు. పట్టణంలో తిరిగి వ్యాపారం చేసుకునే వారు, రోడ్ల పక్కన వ్యాపారుల వద్ద నుంచి ఆసీలు వసూలు చేయొద్దని, ఆ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. పలు వార్డుల్లో వీధి దీపాలు వెలగడంలేదని, మరమ్మత్తులు చేయించాలని, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని, పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కౌన్సిలర్ తెలియజేసిన సమస్యలకు పరిష్కరిస్తామని కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడూరి శివరామకృష్ణ, టిడిపి ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, కంఠమణి రమేష్, రుత్తల భాస్కర్ రావు, బత్తి నాగరాజు తదితర కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

విశాలాంధ్ర- రాజమండ్రి అర్బన్ : గవర్నమెంట్ మెడికల్ కాలేజీ (జీఎమ్‌సీ), రాజమహేంద్రవరంలో 2వ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థుల క్లినికల్ పోస్టింగ్స్‌లో భాగముగా గురువారం స్కూల్ హెల్త్ విజిట్ నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమములో స్థానిక నెహ్రు నగర్ మున్సిపల్ హై స్కూల్ రాజమహేంద్రవరంలో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యముపై అవగాహన కల్పించేవిధముగా ఆరోగ్య విద్యా బోధన కల్పించటం జరిగినది. ఈ కార్య క్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల రాజమహేంద్రవరంలోని కమ్యూనిటి అసోసియేట్ ప్రొఫెసర్ డా. వి.వి. దుర్గా ప్రసాద్, ఆవిభాగపు సిబ్బంది, వైద్య విద్యార్థులు, నెహ్రు నగర్ మున్సిపల్ హై స్కూల్ రాజమహేంద్రవరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా కాంగ్రెస్ మరింత బలోపేతం

విశాలాంధ్ర-దేవరపల్లి: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తామని పార్టీ అభ్యర్థులు ఎంపిక పదవులు కేటాయింపులో డిసిసి అధ్యక్షుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తామని ఏపిసిసి కార్యదర్శి తూర్పుగోదావరి జిల్లా పరిశీలకులు అంబా ప్రసాద్ పేర్కొన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు స్వగృహం వద్ద గోపాలపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిసిసి అధ్యక్షులు ఎంపిక విషయంలో కార్యకర్తలకు వారి అభిప్రాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని అంబా ప్రసాద్ వెల్లడించారు. రాబోవు లోక్సభ అసెంబ్లీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని దేశంలో అన్ని రాష్ట్రాలలో పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసీసీ కార్యదర్శి మిస్ అంబా ప్రసాద్, రాష్ట్ర ఇంచార్జ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అదితా, రాష్ట్ర అబ్జర్వర్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎం బాబ్జి, తేతల వెంకట విశ్వేశ్వర్ రెడ్డి, మార్టిన్ లూథరన్, రఫీ ఉల్లా బే రఫీ ఉల్లా, పాక చిన్నబ్బాయి, కాకర్ల శ్రీ హరిబాబు పాల్గొన్నారు.

రూ.50వేల విలువ చేసే హుండీ బహూకరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి షిరిడి సాయినాథ్ ఆలయానికి గురువారంనాడు దేవరపల్లి గ్రామానిఝకి చెందిన పిన్నమనే రామకృష్ణ కుమారుడు ప్రసాద్ సత్య నాగిని దంపతులు 50వేల రూపాయలు విలువ చేసే హుండీ బహుకరించారు గురువారం నాడు ఆలయ మధ్య జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు అగ్నిహోత్రం సత్యనారాయణ చార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎవరో సత్యనారాయణ చార్యులు మాట్లాడుతూ దేవరపల్లి శిరిడి సాయినాథ్ మందిరానికి 50వేల రూపాయలు విలువచేసే స్టీలు హుండీని బహుకరించిన దాతలను శిరిడి సాయినాథ్ సేవాసమాజ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో గల స్త్రీ సమాఖ్య భవనంలో గురువారం యాన్యుల్ యాక్షన్ ప్లాన్ 2 తయారు చేయుటకు 59 మంది మండల సమాఖ్య కార్య నిర్వాహక సభ్యులుకు 4 రోజులు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఏ పి ఎమ్ జిలానీ అన్నారు. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ 8 అంశాల పట్ల ప్రత్యేక శిక్షణలో చర్చించి ప్రణాళిక సిద్ధం చేయాలని అంశాల వారిగా వివరించడం జరిగింది అని అన్నారు. వీటిలో ఆరోగ్యం, విద్యా, వ్యవసాయం, సంపద సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాదులు, సామాజిక భద్రత వంటి అంశాలు మీద రాబోయే సంవత్సర కాలంలో మన గ్రామ సంఘం సభ్యులకు ఏమి అవసరమో అనేది ప్రణాళిక సిద్ధం చేయాలని తద్వారా కావలసిన సొమ్ము ముందుగా అంచనా వేసి బడ్జెట్ అంచనా తయారు చేసి తీర్మాబం చేయాలని తదుపరి యన్ ఆర్ ఎల్ ఎం వారికి నివేదిక పంపడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు కందికట్ల అరుణ కుమారి, కార్యదర్శి రోంగలి దుర్గా దేవి నాయుడు, సీసీ హరిబాబు, లక్ష్మీ, వెంకట లక్ష్మీ , గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు

విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ

విశాలాంధ్ర-దేవరపల్లి: విద్యతోపాటు క్రీడల్లో కూడా తమ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారని దేవరపల్లి శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ వినూత్న అన్నారు దేవరపల్లి గురువారం శ్రీ చైతన్య పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీకి ఎంపికైన విద్యార్థి కె అభినందన కార్యక్రమం జరిగింది. స్కూల్ ప్రిన్సిపాల్ వినూత్న స్కూల్ ఏజీఎం పార్థసారథి మాట్లాడుతూ క్రికెట్ అండర్ 14 జిల్లాస్థాయి పోటీల్లో దేవరపల్లి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి ఓరుగంటి ఉజ్వల ఎనిమిదో తరగతి చదువుతోంద నీ అన్నారు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీకి ఎంపిక కావడంతో విద్యార్థి ఉజ్వలలను అభినందించారు.

టెన్నికోయిట్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక

విశాలాంధ్ర-దేవరపల్లి: జాతీయ స్థాయికి మిరియాల ప్రియదర్శిని రామన్నపాలెం హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నది, 21, 22 తేదీల్లో శ్రీకాకులం జిల్లా సోంపూడిలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికోయిట్ పోటీల్లో మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక ఐనది డిసెంబర్ 22 నుండి 26 వరకు కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్రము తరుపున పాల్గొంటున్నది. పీడీ సరస్వతి ఎంతగానో ప్రోత్సహిస్తున్నది అని ప్రియాంక తెలిపారు సందర్భంగా హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు రవీంద్ర పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే ముప్పిడి పాలాభిషేకం

విశాలాంధ్ర-కొవ్వూరు: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు వాసవీ పెనుగొండగా పేరు మార్పునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా ప్రభుత్వ నిర్ణయంపై ఆర్య వైశ్య సంఘ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం, కొవ్వూరు ఆద్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొవ్వూరు నియో శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు హాజరయ్యారు. ప్రపంచ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు మద్దుల సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు ముద్దుల నాని,పట్టణ అధ్యక్షులు నాళం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవోలు గ్రామంలో 'రైతన్న మీకోసం'

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని యాదవోలు గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె కమల్ రాజ్ గఅధ్యక్షత న గ్రామ సభ గురువారంనిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు,వ్యవసాయ ఉద్యాన శాఖ సిబ్బంది రైతుల ఇళ్లను సందర్శించి ముఖ్యమంత్రిరైతులకు ఉద్దేశించిన 5 లక్ష్యాలను రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ సున్నం నాగ వరప్రసాద్ గ్రామ తెదేపా నాయకులు నుదురుమాటి శ్రీనివాస్, తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు ఎర్రగోల్ల అంజిబాబు, ఏ.ఏం.సి డైరెక్టర్ మద్దిపాటి చంద్ర గణేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు కరపత్రాలు అందజేశారు

అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - సీతానగరం: అంగన్వాడీ కేంద్రాల పిల్లలలో పోషకాహార లోపాలపై ఉన్న వైద్య పరీక్ష నిర్వహిస్తున్నామని మండల వైద్య అధికారి డాక్టర్ ఏ వి కే చైతన్య అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ జిల్లా అధికారుల, జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి ఆదేశాల మేరకు మండలంలో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా గురువారం సీతానగరం గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాల్లో 126 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశామని తెలిపారు.

దేవరపల్లి చేరుకున్న పాదయాత్ర

విశాలాంధ్ర-దేవరపల్లి: ద్వారకాతిరుమల మండలం మాజీ జడ్పిటిసి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు ఎం.లక్ష్మీరమణి ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రం నుండి సింహాచలం లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం దేవరపల్లి చేరుకుంది. మంగళవారం నాడు ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీవారికి పూజలు చేసి లక్ష్మీ రమణి సింహాచలం వరకు పాదయాత్ర ప్రారంభించారు గురువారం ఉదయం పాదయాత్ర దేవరపల్లి చేరుకుంది దేవరపల్లిలో దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు తెలుగుదేశం నాయకులు బలుసు సత్యనారాయణ కాట్రు భీమరాజు బల్ల సూర్య చక్రం ఓరుగంటి లక్ష్మీపతి రాజు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి ఎం లక్ష్మీరమణి ముందుగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు శిలా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి ఎం లక్ష్మీరమణి మాట్లాడుతూ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి తిరిగి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే తాను ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి పాదయాత్ర చేస్తానని ముక్కుకున్నానని తెలిపారు ఆ ముక్కు తీర్చుకోవటానికి తాను మంగళవారం నాడు ద్వారకాతిరుమల నుండి బయలుదేరి పాదయాత్ర చేస్తూ దేవరపల్లి వచ్చానని తెలిపారు కూటమి ప్రభుత్వం మరో 15 సంవత్సరాలు పాటు అధికారంలో ఉంటుందని ఆమె తెలిపారు.

రైతుల హామీ నేరవేర్చిన కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలం సంధిపూడిలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, అన్నదాతలు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతల అన్నదాత సుఖీభవ నిధులు పీఎం కిసాన్ నిధులతో కలిపి కర్షకుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. గురువారం ఆలమూరు మండలం సంధిపూడిలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయంతో పాటు వివిధ పథకాల గురించి వారికి వివరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచేందుకు రైతన్నా మీకోసం పేరుతో ప్రభుత్వం చైతన్యవంతమైన కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచ సూత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ -పియం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14 వేల వంతున అందజేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.13,500 మాత్రమే ఇచ్చి మాట తప్పిందన్నారు. అందరూ వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. మహిళా రైతులకు 35శాతం సబ్సిడీతో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కోసం రావుల పాలెంలో ఒక ఆఫీసు తెరుస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మీద దృష్టి పెట్టాలన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. డ్రోన్లు తదితర ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. పురుగుమందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. క్యాన్సర్, దీర్ఘకాలిక రోగాలు పెరగడానికి కారణం రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగమేనని తెలిపారు. రైతులంతా ప్రకృతి సేద్యంపై దృష్టి పెడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

ఈదరాడలో విష సర్పాలు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఈదరాడ గ్రామంలోని గుర్రాల బీడు ప్రాంతంలో రక్త పింజర్లు స్థానికులను తీవ్రంగా కలవ రపెడుతున్నాయి. ఏడడుగుల రక్త పింజర గురువారం స్థానికులను ఆందోళనకు గురి చేసింది. దాన్ని స్థానికులు హతమర్చారు. మూడు రోజుల వ్యవధిలో ఈ ప్రాంతంలో రెండు రక్త పింజర్లను స్థానికులు హతమర్చారు. ఇటీవల కాలంలో రక్త పింజర్ల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ న్యాయవాదులకు విశ్రాంతి భవన ప్రారంభం

విశాలాంధ్ర - రామచంద్రపురం : రామచంద్రపురం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులకు విశ్రాంతి మందిరం, 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్ట్ జడ్జి జి ఆనంది గురువారం ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాల రావు అధ్యక్షతన ఈ విశ్రాంతి మందిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి నాగేశ్వరరావు నాయక్, ఏపీపీ కప్పల సునీల్, ఏజిపి లకాని పద్మ కమల కుమారి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా సాధికారికపై ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సర్వే

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : రమణయ్యపేటలో వివిఎస్ఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి మహిళా సాధికారత పై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కెవి రాఘవరావు మాట్లాడుతూ సమాజంలో సమాన అవకాశాలు పొందేలా వారిని ప్రోత్సహించే ఒక ప్రక్రియ మహిళా సాధికారత అని అన్నారు. మహిళలు సంక్షేమం, సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుపరుస్తున్నాయని అన్నారు. ఈ పథకాల ద్వారా మహిళలు సాధికారత సాధన విషయమై ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిని కే సుకన్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

అన్నదాతల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌తో కలిసి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికి వెళ్లి రైతన్నా మీకోసం కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయంతో పాటు వివిధ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ సానా సతీష్, జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ధాన్యం డ్రయర్ ప్రారంభించారు. మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. కర్షకులను చైతన్యవంతులను చేసేందుకు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.13,500 మాత్రమే ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు,మహిళా రైతులకైతే 35శాతం సబ్సిడీ ద్వారా వ్యవసాయ అనుబంధ

పరిశ్రమల ఏర్పాటుకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కొబ్బరిలోనే 20 వరకూ పరిశ్రమలు పెట్టుకోవచ్చన్నారు. అరటికి సంబంధించి 10 వరకూ పరిశ్రమలు పెట్టుకోవచ్చన్నారు. డైరీలు పెట్టుకోవచ్చని సూచించారు. రైతు కుటుంబానికి సంధించిన మహిళలకు, పిల్లలకు సబ్సిడీ మీద రుణాలు ఇచ్చి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం మీద దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, తోట నవీన్, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ ఎస్వీఎస్ అప్పలరాజు, పరిమిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, కుంచె రాజా, కందుల చిట్టిబాబు, ఉండవల్లి వీర్రాజు, అడబాల ఆంజనేయులు, కంటిపూడి సత్యనారాయణ, దిడ్డి శ్రీను, గండేపల్లి ఎండిఓ హరికృష్ణ సత్తారెడ్డి, గండేపల్లి, జగంపేట ఏవోలు లక్ష్మి, నరసింహ ఉద్యాన శాఖ అధికారిని శ్రీవల్లి, అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : చితికిపోయిన గ్రామీణ అభివృద్ధి, అస్తవ్యస్తమైన పంచాయితీ వ్యవస్థలను తిరిగి పునర్జీవింప చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్న ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పల్లె పండుగ 2.0కి శ్రీకారం చుట్టడం పట్ల మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 13,326 గ్రామ పంచాయతీలలో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు స్థాపించారన్నారు. ఆ గ్రామసభలో ప్రజలు ఆమోదించిన పనులను రూ.4 వేల 500 కోట్లతో 4 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు, 276 కిలోమీటర్లు తారు రోడ్లు నిర్మాణం జరిగిందన్నారు. పాడి పశువుల సంరక్షణకై 22,500 గోకులాలు నిర్మాణం, 25 వేల నీటితొట్ల నిర్మాణం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ సాధారణ నిధులు,

ఏషియన్ ఇన్ఫ్రాక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు ప్రాజెక్టు తదితర నిధులను పల్లె పండుగ 2.0 పరిధిలోకి తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయనున్నారని అన్నారు. రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 పనులకు ఒకేసారి శ్రీకారం చుట్టి పల్లెల్లో పండుగ వాతావరణం లో సిసి రోడ్లు, మ్యాజిక్ డ్రైన్లు, మినీ గోకులాలు నిర్మించనున్నారని అన్నారు. రాష్ట్ర గ్రామీణ ముఖచిత్రం మారేలా పల్లె పండుగ నిర్వహిస్తున్న మంత్రి పవన్ కళ్యాణ్ అభినందనీయులని అడబాల తెలిపారు.

పరంజ్యోతి వర్ధంతి సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రామచంద్రపురం : మైదాన ప్రాంత మొట్టమొదటి విప్లవ కారుడు, పీడిత ప్రజల ఉద్యమాలకు శ్రీకారం చుట్టిన విప్లవ నాయకుడు గుర్రాల పరం జ్యోతి 20వ వర్ధంతి సభను వెంకటాయపాలెం స్థానిక సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయం వద్ద, డిసెంబర్ 1 తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు సభ జరుగుతుందని, పార్టీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకెఎమ్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడిఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బిసిద్దు ఒక ప్రకటనలో తెలియజేశారు. నేడు పాలకవర్గ దోపిడి పార్టీలు సంస్కరణ పేరుతో పీడిత ప్రజానీకాన్ని భ్రమలకు గురి చేస్తున్నాయని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నాయని, రాబోయే కాలంలో విప్లవ పోరాటాలకు పీడిత వర్గం తన విముక్తి కోసం పోరాటమే మార్గదర్శకంగా స్వీకరించాలని అన్నారు.

పేద విద్యార్థికి కళాశాల అధ్యాపకులు సాయం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలోని మెల్లపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థి ములగలేటి సూర్యచంద్ర శేఖర్ ఇంటి ఆస్తి పూర్తిగా అగ్నికీలల్లో కాలిపోయిన ఘటనపై, రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సేవామూర్తులుగా నిలిచారు. విద్యార్థికి అండగా ఉండాలని నిర్ణయించిన కాలేజీ డెవలప్మెంట్ కమిటీ (జనజ) అధ్యక్షులు పి కనికి రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌వి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు అందరూ కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సదుద్దేశంతో కళాశాల తరపున రూ.17,000 నగదు సేకరించి విద్యార్థి సూర్యచంద్ర శేఖర్ కుటుంబాన్ని ఆర్థిక పరంగా ఆదుకున్నారు. అగ్ని ప్రమాదంతో బాధపడుతున్న ఆ కుటుంబం ఈ సహాయం పట్ల లోతైన కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ, "మా ఇంటిని తిరిగి నిలబెట్టుకునే ప్రయత్నంలో ఈ సహాయం మా జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేనిది" అని పేర్కొంది. విద్యా సంస్థ తమ విద్యార్థులకు ఎప్పుడూ అండగా ఉంటామని అధ్యాపకులు తెలిపారు. ఈ సహాయక చర్యకు స్థానికులు పలువురు ప్రశంసలు తెలియజేశారు.

కుండలేశ్వరస్వామికి కేంద్ర మంత్రి సతీమణి పూజలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : దక్షిణ కాశీగా పేరుందిన కుండలేశ్వరంలో పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయంలో నరసాపురం ఎంపీ, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ సతీమణి వెంకటేశ్వర దేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ మర్యాదలతో దేవస్థానం ఈఓ సూర్య వెంకట దుర్గా ఆధర్వంలో ప్రధాన అర్చకులు కామేశ్వర రావు వేద ఆశీర్వచనం చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ, తెలుగుదేశం నాయకులు మోటమర్రి ఉదయభాస్కరరావు, గంగుమళ్ల నిరంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట శ్రీ భీమేశ్వర ఆలయం వద్ద శంకర నేత్రాలయ కంటి వైద్యాశాల, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యంజలి (అమెరికా)ల

సహకారంతో 27వ తేదీ నుండి డిసెంబర్ 3వ తేదీవరకు జరగనున్న ఉచిత కంటిపొర చికిత్స శిబిరాన్ని కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబులు గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ శిబిరం నందు శ్రీ కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు సుమారు 5 కోట్ల విలువగల అత్యాధునికమైన బస్సులలో కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు గడ్డమనుగు శివ, కందూరి శ్యామ్, మీసాల సునీత ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్‌లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బల్ల నీలకంఠం, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, బదుగు శ్రీకాంత్, సరోజ వాసు, అడబాల కుమారస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్‌రావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గోల్తి సత్యనారాయణ, కంచర్ల సుష్మా మోహిని తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం అత్యున్నత చట్టం

వెమ్మెల్యే దేవ వరప్రసాద్

విశాలాంధ్ర – రాజోలు : దేశంలోని వ్యవస్థలన్నీ రాజ్యాంగం మీద ఆధారపడి పని చేస్తున్నాయని ముఖ్యంగా శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఏర్పాటు, ఆయా అధికారాలు బాధ్యతలు వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో రాజ్యాంగం నిర్దేశిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు మలికిపురం డిగ్రీ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్, ఆధ్వర్యంలో జరిగిన భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభకు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, గణతంత్ర రాజ్యాంగ అవతరించిందని అన్నారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రాజ్యాంగం నుండి సంక్రమించాయని పౌరుల హక్కులు విధులను, చట్టాన్ని నిర్దేశించేది భారత రాజ్యాంగం అని అన్నారు. ప్రభుత్వ విధివిధానాలను, నియమాలను, వారి అధికారాలను రాజ్యాంగం అందించిందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యా ర్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి గౌరవ వాధ్యక్షుడు దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరి గిన ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీలు బళ్ళ. ప్రసన్నకుమారి, మట్టా శైలజ, బత్తుల. లక్ష్మణరావు, మలికిపురం సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఎంపిపిలు వీరా మల్లిబాబు, మెడిచర్ల సత్యవేణి, భూపతి అజయకుమార్, నల్లి శివకుమార్,"ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి రవి కుమార్, గెద్దం తులసీ భాస్కర్, తోటే ప్రతాప్, ప్రిన్సిపాల్ ఆనంద మహోని, అధ్యాపకులు నక్క రమేష్, మార్టిన్, రాపాక. మహేష్, గెద్దం ప్రభాకర రావు, నేతల నాని, బత్తుల రవిప్రసాద్, పోలిశెట్టి గణేష్ డా గొల్ల జేసురత్నం పాల్గొన్నారు.

నిరంతరం వాహనాల తనిఖీ

-మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర – రౌతులపూడి : వాహనాల తనిఖీని నిరంతరం చేపడతామని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. నిబంధనలను పాటించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 2025 సంవత్సరం ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు 577 కేసులు నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై నమోదు చేసి 68 లక్షలు జరిమా విధించినట్లు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యముగా రౌతులపూడి నుంచి నిత్యం రవాణా చేసే నల్లరాయి, చింతలూరు నుండి రవాణా చేసే ఎర్రమట్టి లారీలపై అధికలోడు మరియు భద్రతా ప్రమాణాలు పాటించని లారీలు పై ఇప్పటివరకు 116 కేసులను నమోదు చేసి 16 లక్షలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని భద్రతా నియమాలు పాటించాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి యుటిఎఫ్ ఆదరణ

విశాలాంధ్ర – ఆత్రేయపురం : ఆత్రేయపురం గ్రామంలోని ఎంపిపిఎస్ చినపేట వద్ద సోమవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పమ్మి శాంత కుమారి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైంది. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ లక్ష్యాలలో ఒకటైన సామాజిక స్పృహను ప్రతిబింబిస్తూ, ఆ బాధిత కుటుంబానికి సహాయక సామగ్రి అందించారు. ఈ రోజున పాఠశాల ఉపాధ్యాయులు పి త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతి బసు ఆధ్వర్యంలో మండల యుటిఎఫ్ శాఖ సభ్యులు 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంటసామాగ్రి, దుప్పట్లు తదితరంగా రూ. 2,500 విలువ చేసే సహాయక సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతి బసు, ఎఫ్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ ఎస్‌వివిఎన్ఎస్ ప్రసాద్, మండల అధ్యక్షులు టి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుధాకర్ బాబు, కోశాధికారి కదలి ప్రసాద్, ఆఫీస్ బ్యారర్లు కందుల గోవిందరావు, చిప్పాడ సత్యనారాయణ, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం

విశాలాంధ్ర – రాజోలు : భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం అని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పివివి వర ప్రసాద్ పిలుపునిచ్చారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠ శాలలో భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఆయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాజ్యాంగ నిర్మాతలకు ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి భారత రాజ్యాంగం ప్రాతిపదిక అని కొనియాడారు. అనంతరం మలికిపురం డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచి రాజోలు శాసన సభ్యులు. దేవ వర ప్రసాద్ చేతుల మీదుగా ప్రథమ, తృతీయ, కన్సులేషన్ బహుమతులు పొందిన కె గీతిక, బి దేవిశ్రీ, ఎం హర్ష, జి వరలక్ష్మీలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పందలపాకలో కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర – పెదపూడి : వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వైద్య కళాశాలలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పార్టీ బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి (బుజ్జి) అన్నారు. గురువారం పందలపాకలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా బుజ్జి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సత్తి హరిప్రసాద్ రెడ్డి, కర్రి ఇన్సారెడ్డి, బొడ్డు ముత్యాలరావు, రొంగల వెంకటేశ్వరరావు, తమలంపూడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం

ఇంచార్జ్ కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి బాధ్యత అత్యంత ముఖ్యమని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ పౌరులను కోరారు. గురువారం ఉదయం నగరంలోని డైరీ ఫార్మ్ సెంటర్ ప్రాంతంలో శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలించారు. గమనించిన కమిషనర్, అక్కడి వ్యాపార యాజమాన్యాలను కఠినంగా హెచ్చరించారు. షాపుల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని, వినియోగదారులు రోడ్డు మీద చెత్త వేయకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ డ్రైనేజీలను శుభ్రంగా ఉంచేలా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తించాలి అని సూచించారు. డ్రైనేజ్ పై అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తరువాత రాజీవ్ గృహకల్ప సముదాయంలో త్రాగునీటి నిల్వను పరిశీలించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట సచివాలయ సిబ్బంది తదితరులున్నారు. అన్న క్యాంటీన్ పరిశీలన పర్యటనలో భాగంగా కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ డైరీ ఫార్మ్ సెంటర్లోని అన్న క్యాంటీన్‌ను కూడా తనిఖీ చేశారు. అల్పాహారం కోసం వచ్చిన ప్రజలను పలకరించి, ఆహార నాణ్యతపై అభిప్రాయాలు సేకరించారు. అవసరమైతే మార్పులు చేస్తామన్నారు.

ప్రజా దర్బార్‌ను ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర – గోకవరం: నేడు గోకవరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని గోకవరం మండలం మాజీ జడ్పిటిసి సభ్యులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పాలూరి బోసు బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాదర్బార్ తీసుకుందని అందులో భాగంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు గోకవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రజలందరూ వచ్చి తమ సమస్యలను వినతిపత్రం రూపంలో అందించి ఎమ్మెల్యే నెహ్రూ ద్వారా పరిష్కరించు కోవాల్సిందిగా కోరారు. సు

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

విశాలాంధ్ర – నిడదవోలు : దేవస్థానం అభివృద్ధి కి, ఆస్తుల పరిరక్షణ కు కృషి చేస్తామని శ్రీ ఉమా మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు అన్నారు. నిడదవోలు మండలం పందలపర్రు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ఉమా మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం నిర్వహించారు. ఉమా మల్లేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ గొల్లపల్లి మురళి కృష్ణ పాలకవర్గ సభ్యులుగా భోగిరెడ్డి సుబ్బారావు, పులిమి సూర్యనారాయణ, సింగనపూడి మండేశ్వరరావు.,అయినమిల్లి యేసు, గొలుగొండ వెంకటలక్ష్మి, తొంటపాక వెంకటలక్ష్మి, పుల్లేటికుర్తి కనకదుర్గ, కప్పల సుజాత, దేవస్థానం అర్చకులు, ఎక్స అఫీషియో మెంబర్ గా బాధం పూడి సూర్యనారాయణ మూర్తి లతో ఆలయ ఇనస్పెక్టర్ బి లక్ష్మీ నరసింహారావు, ఆలయ ఈఓ సోమాల శివ ప్రమాణం చేయించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర – పెద్దాపురం : రాష్ట్ర స్థాయి బాస్కెట్ పోటీల్లో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు పాఠశాల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులకు ఓ ప్రకటన విడుదల చేస్తూ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న దాడి కమల వైష్ణవి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరుపున పోటీల్లో పాల్గొని వెండి (సిల్వర్) పతకం సాధించిందన్నారు. బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలలో పాల్గొని, జిల్లా జట్టు తరపున చిత్తూరు మదనపల్లిలో నవంబర్ 24 నుండి 26 వరకు జరిగిన "69వ ఎస్‌జిఎఫ్ఐ అంతర్ జిల్లాల అండర్–14 బాయ్స్, గర్ల్స్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించిందన్నారు. తమ పాఠశాల తరపున పాల్గొని రాష్ట్రస్థాయిలో వెండి పతకం సాధించిన విద్యార్థినికి తనకు శిక్షణను ఇచ్చిన కోచ్‌ను శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎమ్‌వివిఎస్ మూర్తి, పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కోఆర్డినేటర్ ఉషా చైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్ దేవదాసుకు పదోన్నతి

విశాలాంధ్ర – కడియం : కడియం మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్ సిహెచ్ దేవదాసుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి దక్కింది. ఆయనను రాజనగరం మండలం జి ఎస్ డబ్ల్యు ఎస్ డిప్యూటీ ఎంపీడీవో గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గత మూడేళ్లుగా ఇక్కడ సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తూ అందరి మన్ననలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ఎంపీడీవో కె. రమేష్, మండల పరిషత్ ఏవో సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో ఎన్ శ్రీనివాస్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు అభినందించారు.

విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు

విశాలాంధ్ర – గోపాలపురం : విద్య ద్వారానే సమాజంలో ప్రతి వ్యక్తికి మంచి గుర్తింపు లభిస్తుం దని చెరుకుమిల్లి సొసైటీ చైర్ పర్సన్ గద్దె హరిబాబు తెలిపారు. గురువారం మండలములోని చిట్యాల జిల్లా పరిషత్తు హైస్కూల్ లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గద్దె హరిబాబు మాట్లాడుతూ కష్టంతో కాక ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు నాయకత్వ లక్షణాలతో రానున్న కాలంలో యువత పలు రంగాలలో స్థిరపడి సమాజంలో ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగాలన్నారు. సొసైటీ ద్వారా ఏర్పాటుచేసిన లంచ్ బాక్స్ లను పలు పోటీలలో విజేతలైన 25 మంది విద్యార్థులకు నాయకుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సత్యనారాయణ, చెరుకుమిల్లి మాజీ సర్పంచ్ ఉండవల్లి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు శ్రీహరి, ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ అంతర్గత అంశాల్లో పాక్ ప్రమేయం సహించేది లేదు

విశాలాంధ్ర - అమలాపురం : మతతత్వ అప్రజాస్వామిక సైనిక పాలనకు నెలవైన పాకిస్తాన్ పాలకులు సెక్యులర్ భారత దేశంలో అంతర్గత సమస్యల్లో తగుదునమ్మ అని తలదూర్చి సలహాలు సూచనలు చేసే అర్హత ఎంత మాత్రం లేదని సీపీఐ రాష్ట్ర నాయకులు కె. సత్తిబాబు పేర్కొన్నారు. వివిధ మతాలు



ప్రాంతాలు గల సువిశాల భారతదేశం వివిధ మతాలు ప్రాంతాలు గల దేశం భిన్నత్వంలో ఏకత్వంతో భారత రాజ్యాంగ స్ఫూర్తితో 75వ రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమం జరుపుకొని రాజ్యాంగ రక్షణ కోసం పునరంకితమయ్యామని అన్నారు. పాలనా క్రమంలో పాలకులు వైఫల్యాలు ఉంటే అంశాల పైన ప్రజా బాహుళ్యంలో ఎత్తిచూపి పరిష్కరించుకుంటామని తెలిపారు. భారత సార్వభౌమాధికారానికి నష్టం వాటిల్లేలా ఏ దేశం వ్యవహరించినా 147 కోట్ల మంది భారతీయులందరం ఒక్కటై ఐకమత్యంతో శత్రు దేశాన్ని తిప్పి కొడతామని సత్తిబాబు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జివి రమణ పేర్కొన్నారు.

పంట మార్పిడిపై దృష్టి సారించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : గురువారం తొర్రేడు గ్రామంలో నిర్వహించిన 'రైతన్న మీ కోసం' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కరపత్రాలను పంపిణీ చేసి, రైతులతో నేరుగా మాట్లాడారు. వరి

సాగు వల్ల కలిగే లాభాలు, ఖర్చు-లాభాల నిష్పత్తి విషయాలను సమీక్షించారు. రబీ సీజన్‌లో ఎకరాకు సుమారు 20 వేల రూపాయల వరకు లాభం వస్తుందని, ఖరీఫ్‌లో పెట్టుబడి తిరిగి వస్తోందని రైతులు వివరించారు. సేంద్రియ వ్యవసాయం వైపు మారడం ద్వారా భూసారాన్ని పెంపొందించు కోవచ్చని, ఆరోగ్యకరమైన పంటలు సాగు చేయడం సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కొత్త ఆవిష్కరణ లతో సాగు చేసి మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రావు, జిల్లా సహకార అధికారి ఎమ్. వెంకట రమణ, సహాయ సంచాలకులు రమేష్, రైతులు, స్థానిక అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఇల్లు-ఒక కుటుంబ స్వప్నం

విశాలాంధ్ర - ఐ పోలవరం : పేదవాడి కలల స్వప్నం ఇల్లు అని, అలాంటి స్వప్నాలను సాకారం చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించిందని ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో గృహ నిర్మాణ పనుల పురోగతిని

పరిశీలించాలని, జిల్లా గృహనిర్మాణ అధికారితో కలిసి, నాలుగు మండలాల అధికారులతో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు కట్టుకునే ప్రతి కుటుంబానికి అధికారులు దగ్గరుండి హౌసింగ్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను నిర్దిష్ట సమయానికి పూర్తిచేయడానికి అధికారులు, లబ్దిదారులతో కలిసి సమన్వయంతో పనిచేసి పూర్తిచేయటానికి అధికారులకు సూచించారు. లబ్దిదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించి ప్రజలకు అండగా ఉండాలని తెలిపారు.

ధర్మవరంలో పైపుల తయారీ ఇండస్ట్రీ ప్రారంభం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో పాండురంగ పివిసి పైపుల తయారీ ఇండస్ట్రీని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణం రాజు ప్రారంభించారు. ధర్మవరం జాతీయ రహదారి సమీపంలో దాట్ల రంగరాజు నూతనంగా స్థాపించిన పాండురంగా పీవీసీ ఇండస్ట్రీ ప్రారంభోత్సవంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, భీమవరం ఎంపిపి పేరిచర్ల నరసింహరాజులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దెందుకూరి రామకృష్ణ రాజు, దాట్ల వంశీ రాజు, దాట్ల రోహిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సమాజంలో దూసుకుపోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: దివ్యాంగులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని సమాజంలో అభివృద్ధి చెందాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డిసెంబర్ 3న నిర్వహించ నున్న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారా క్రీడల పోటీలను కలెక్టర్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత పారా క్రీడల కోసం అవగాహన నడకను కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించి, బధిర విద్యార్థులతో కలిసి నడిచారు. అనంతరం దివ్యాంగులను ఉత్సాహపరిచే విధంగా వారితో కలిసి స్వయంగా కలెక్టర్ క్రికెట్ ఆడి బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఏరంగంలోను తీసిపోని విధంగా అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. మీ సామర్థ్యం, మీ బలం మీకు తెలియదని వైకల్యం లేని వారి కంటే మీరు ఎంతో సమర్థులని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఎం.మోహన్ దాస్, డిఎన్ఆర్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, సెక్రటరీ గాదిరాజు బాబు, సభ్యులు రామకృష్ణంరాజు, పిడి బి.వి నరసింహరాజు, ఫిట్ జోన్ జిమ్ నిర్వాహకులు దాసరి చందు, బధిర బాల, బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో నూతన ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఓగూరి భాగ్యశ్రీ, కమిటీ

సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గట్టుగా నూతన పాలక వర్గం కూడా పని చేయాలని సూచించారు. రైతులకు అండగా ఉండి యార్డు ద్వారా వారికి అవసరమైన సహకారాన్ని అందించాలన్నారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కోరుతూ నూజివీడు జేఏసీ, నూజివీడు బార్ అసోసియేషన్, పీపుల్స్ ఫోరం, అభ్యుదయవాదులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని జేఏసీ గౌరవ అధ్యక్షులు చలసాని వెంకట రామారావు కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని గతంలో అనేక పోరాటాలు చేశామన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నూజివీడును ఏలూరు జిల్లాలో కలపటాన్ని వ్యతిరేకిస్తూ ఏడాది పాటు పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు, ధర్నాలు, నిరాహారదీక్షలు చేపట్టామన్నారు. 72 గ్రామాల్లో జీపుయాత్ర, లక్ష కరపత్రాల పంపిణీ, 25వేల సంతకాల సేకరణ ప్రజా బ్యాలెట్ నిర్వహించి నూజివీడు నుండి విజయవాడకు పాదయాత్రగా వెళ్లి అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. పెద్ద ఎత్తున జరిగిన ప్రజా ఉద్యమంలో సిపిఐ, జనసేన, టిడిపి, కాంగ్రెస్, బిజెపి,హెల్పింగ్ హాండ్స్, కుల సంఘాలు, రైతులు, కార్మిక,కర్షక, న్యాయవాద, విద్యార్థి,

యువజన, మహిళా సంఘాలు ఈ పోరాటంలో భాగస్వాములయ్యా యన్నారు. జేఏసీ అధ్యక్షులు మరీదు శివరామకృష్ణ, బార్ అసోసియేషన్ నాయకులు ఇందుపల్లి సత్య ప్రకాష్ మాట్లాడుతూ అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నూజివీడు వచ్చినప్పుడు హామీ ఇచ్చారని మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ ఫోరం నాయకులు పివి కుమార్, సబ్బినేని శ్రీనివాస్, గొల్లపూడి రవిబాబు, ఎం. రాజశేఖర్, ఫరూక్, నూజివీడు జేఏసీ కోశాధికారి చాట్ల పుల్లారావు, జేఏసీ నాయకులు ఎం. సునీల్‌కుమార్, ఎర్రశెట్టి రాము, నూజివీడు బార్ అసోసియేషన్ నాయకులు మన్నెం రమేష్, వైయస్ దొర్రె, సిహెచ్ అర్జున్‌రావు, వై. హరిబాబు, జాన్‌బాబు, చింత తేజచంద్, సుధాకర్, బి. రామకృష్ణ, సీపీఐ నాయకులు సిహెచ్ వీరభద్రరావు, బొగ్గు ముఖర్జీ, జనసేన నాయకులు బాజీ, కె. చంద్ర తదితరులు పాల్గొన్నారు .

ఐదు సూత్రాలు రైతులు తెలుసుకోవాలి

అడిషనల్ డైరెక్టర్ (హెల్త్) డా॥ఎన్.రజని కుమారి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వం రైతులకు ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలు ప్రతి రైతు తెలుసుకోవాలని అడిషనల్ డైరెక్టర్ (హెల్త్) డాక్టర్ ఎన్. రజనికుమారి అన్నారు. గురువారం ఆమె జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి, డెప్యూటీ డైరెక్టర్

డాక్టర్ అంబేద్కర్‌తో కలిసి కాకినాడ అర్బన్ 1962 మొబైల్ వెటర్నరీ అంబ్యులేటరీ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతాంగం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పాలు, గుడ్లు, మాంసం రాష్ట్ర స్థూల విలువ జోడింపునకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంలో భాగంగా డాక్టర్ బాల సువర్ణ, పారావెట్ బాలయోగి, పైలట్ శ్రీను (కాకినాడ అర్బన్)ను వారి ఉత్తమ సేవలు, పశుసంవర్ధక రంగానికి చేసిన కృషికి గాను సన్మానించారు.

గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీ మహేష్

విశాలాంధ్ర - ఏలూరు : వట్లూరు బాలికల గురుకుల పాఠశాలను గురువారం మధ్యాహ్నం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల పాఠశాలలో తరగతి గదులను

పరిశీలించారు. భోజన శాలను తనిఖీ చేసిన ఎంపీ మహేష్ వసతి సౌకర్యాలు, ఆహార పదార్థాల మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఎంపీ, కాసేపు విద్యార్థినులతో ముచ్చటించారు. గురుకుల పాఠశాలను పరిశుభ్రంగా, అన్ని సౌకర్యాలతో, ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న వార్డెన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఎంపీ మహేష్ కుమార్ అభినందించారు.

వలస కార్మికుల గుర్తింపు లేకుండా ఆశ్రయం కల్పించవద్దు : డీఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఇటీవల ఏలూరులో మావోయిస్టు పట్టుబడిన పట్టుబడిన నేపథ్యంలో పోలీసు శాఖ గట్టి భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఏలూరు నగరంలోకి చొరబడే అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇదే సమయంలో ప్రజా రక్షణ మరియు పరిరక్షణ అమలు (పోలీస్ శాఖపబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ 2013) చట్టం ప్రకారం పోలీసుల సూచనలు పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించి ఇబ్బందులకు గురికావద్దని హెచ్చరించింది. ఈ మేరకు ఈ నోడల్ అధికారి అయిన ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్, కమిటీ నిర్ణయం మేరకు అన్ని వ్యాపార సంస్థలు, హోటళ్లు సినిమా హాల్ లు, మాల్స్ మరియు చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థల యజమానులు, గృహ యజమానులు వారి గృహాలను అద్దెకి ఇచ్చే సమయాలలో వలస కార్మికుల వివరాలను గురించి పోలీసుల నుండి లేదా ప్రైవేట్ సంస్థల ద్వారా అయినా తెలుసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఏలూరు జిల్లాలో ఇటీవల జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో, జిల్లా ప్రజల భద్రతను పటిష్టం చేయడానికి జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ 2013 నిబంధనల ప్రకారం జిల్లాలోని వ్యాపార సంస్థలు, ఉపాధి కల్పించే ఇతర సంస్థలు కింది అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.